# ముగింపు

– కాశీభట్ల శశికాంత్

**క్రేన్ కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ**



కాలింగ్ బెల్ మోగడంతో చదువుతున్న పుస్తకం పక్కన పెట్టి తలుపు తీసాను. వచ్చింది శ్రీధర్ "రావయ్యా శ్రీధర్ చాలా రోజులయింది కలిసి" అని అతనిని లోపలకు తీసుకు వెళ్ళాను.

శ్రీధర్ యువకుడు. సాహిత్య సభలు, సమావేశాలకి వస్తూ ఉంటాడు. నాకు సాహిత్యం అంటే ప్రాణం. మా ఇద్దరికీ అక్కడే పరిచయం అయింది. ఆ పరిచయంతో మా ఇంటికి కూడా వస్తూండేవాడు. పెద్దవాడిని కావటం వలన అవి ఇవీ సందేహాలు అడుగుతూ ఉండేవాడు. మంచి చురుకైనవాడు. అతనికి వచ్చిన సందేహాలు వింటుంటే నాకే ఆశ్చర్యం వేసేది. ఆ వయస్సులో నాకు సాహిత్యం పట్ల అంత అవగాహన ఉండేది కాదు. పైగా ఈ జనరేషన్‌లో పుస్తకాలమీద ఆసక్తి తగ్గుతోంది. అటువంటిది శ్రీధర్ పాత కథలని చదవడం, చర్చిస్తూ ఉండటం చాలా ఆనందం కలిగించింది.

శ్రీధర్ చేతిలో ఏవో కాగితాలు ఉన్నాయి. మామూలుగా కాసేపు ఆవిషయం, ఈ విషయం మాట్లాడేక అసలు విషయం చెప్పాడు.

"సార్ నేనొక కథ వ్రాసాను. చూడండి ఎలా ఉందో"

"చాలా సంతోషం. చదివి వినిపించు."

అతను కథ చదివి వినిపించాడు. చాలా బాగా వ్రాసాడు. మొదటి కథే అయినా కథని నడిపించిన విధానం చాలా బాగుంది. కాకపోతే ముగింపే అంత బాగా రాలేదు.

"చాలా బాగా రాసావు. కానీ ముగింపు వాస్తవ దూరంగా ఉంది. అది మారిస్తే కథ అద్భుతంగా ఉంటుంది.

అతను ఆ రోజుకి వెళ్ళిపోయి రెండు రోజుల తర్వాత మరొక ముగింపుతో వచ్చి మళ్ళీ కథను వినిపించాడు. దీని కన్నా మొదటిదే నయం అనిపించింది. ఆత్రుతగా నాకేసి చూస్తున్న అతనికి ఈ విషయం చెప్పాలనిపించలేదు. కానీ చెప్పక తప్పదు. అతనిలో మంచి ఊహాశక్తి ఉంది. కాకపోతే మెరుగులు దిద్దవలసిన అవసరం ఉంది.

నా గురించి చెప్పాలంటే నేను రచయితను కాను. కానీ విస్తృతంగా చదవడం వలన కథల మంచీ చెడుల గురించి విశ్లేషించి చెప్పగల శక్తి ఉంది.

''ఈ ముగింపు కూడా అంతగా బాగుండలేదు. ఈ కథని ఒక విధంగా ముగిస్తే బాగుంటుందని నాకు అనిపించింది. చెప్పమంటావా?"

చెప్పండి సార్

రెండు రోజుల క్రితం అతను కథ చెప్పి వెళ్ళిన తర్వాత నేను బాగా ఆలోచించి నాకు తోచిన ముగింపును ఒక కాగితం మీద వ్రాసి ఉంచాను. అది అతనికి చూపించాను.

అతను అది చదివి ఆలోచించాడు.

"నిజమే సార్. ఇది వాస్తవానికి దగ్గరగా ఉంది. కానీ మీరు రాసిన దానిని నేను వాడుకోడం ఏం బాగుంటుంది".

"కథంతా నీ స్వంతం చాలా చక్కగా నడిచింది. ముగింపు ఒక్కటే నీది కానంత మాత్రాన వచ్చిన ఇబ్బందేమీలేదు. ఇదయినా మొదటి కథ కాబట్టి. ముందు ముందు ఇంతకన్నా మంచి కథలు రాయగలవన్న నమ్మకం నాకుంది. ఇంకేమీ సందేహించకుండా ఈ ముగింపు రాసి పంపించు. కథని కళ్ళకి అద్దుకొని

మరీ వేసుకుంటారు".

అతను ఆ కథని నేను రాసిన ముగింపును చేర్చి ఒక వారపత్రికకు పంపిచాడు. వాళ్ళు త్వరగానే దానిని ప్రచురించారు. శ్రీధర్ ఆ పత్రికను తీసుకు వచ్చి నాకు చూపించాడు. చాలా ఆనందం కలిగింది. ఆ కథను అచ్చులో చూసు కుంటుంటే. ముఖ్యంగా ముగింపు వాక్యాలు చదువుతుంటే గర్వంగా అనిపించింది. నిజం చెప్పాలంటే కథ ఎంత బాగుందో ముగింపు అంతకన్నా బాగుంది.

"చాలా బాగుంది శ్రీధర్. నీ మొదటి ప్రయత్నమే సక్సెస్ అయింది. ఇంక నువ్వు బాగా కృషి చెయ్యి. తప్పకుండా మంచి రచయితవి అవుతావు"

కొద్దిరోజుల తర్వాత అతను మరొక కథ రాసి తీసుకువచ్చాడు. ఆ కథకి అతనిచ్చిన ముగింపు చాలా రొటీన్‌గా ఉంది. మొదటి నుంచి చక్కగా నడిచిన కథ చివరలో వీక్ అయిపోయింది. చెబితే నిరుత్సాహ పడతా డేమో? కానీ చెప్పక తప్పదు. ఇలా పంపినా కథని ఏదో ఒక పత్రిక ప్రచురించవచ్చేమో. కానీ కథ పత్రికలో పడటం ఒకటే ముఖ్యం కాదు కదా.

"ఏం సార్ ఎలా ఉంది కథ" ఆలోచన లో పడ్డ నన్ను అడిగాడు "కథ చాలా బాగా వచ్చింది. కానీ చివరలో అసంతృప్తిని కలిగించింది. మరొకసారి ఆలోచించి మంచి ముగింపును ఇవ్వు. కథకి ప్రాణం చివరలోనే ఉంటుంది." పాముకుప్రాణం తోకలో ఉన్నట్లు.

"నేను ముందు వేరే ముగింపు అనుకున్నాను. కానీ అది నచ్చక మార్చాను" అని అదికూడా చెప్పాడు. ఫరవాలేదు. కానీ తక్కువ స్థాయిలో ఉంది.

"మళ్ళీ ఇంటికి వెళ్ళి ఆలోచించు. ఖంగారేమీ లేదు. ఎన్ని రాసావన్నది ముఖ్యం కాదు. ఎంత బాగా రాసావన్నదే ముఖ్యం."

అతను వెళ్ళిపోయాడు. ఒక వారం గడిచింది. అతను రాలేదు. నిజానికి అతని కథల పట్ల నేనే ఎక్కువ ఆత్రుత చూపుతున్నా నేమో అతనింటికి ఫోన్ చేసాను. ఇంకా ఆలోచిస్తున్నానన్నాడు. ఇంక మనసు ఉండబట్టక ఫోన్‌లోనే ఎలా ముగిస్తే బాగుంటుందో చెప్పాను.

"చాలా బాగుంది సార్. ఇలా రాయవచ్చని నాకు తట్టనే లేదు".

"ఇదంత గొప్ప విషయం కాదు. ఒక్కొక్కళ్ళ ఆలోచనతీరు ఒకో రకంగా ఉంటుంది. అందులోనూ నేను ఎక్కువగా కథలు చదవటం వలన కథని ఎలా ముగిస్తే పాఠకులకి విమర్శకులకి, నచ్చుతుందో గ్రహించగలను. ముందు ముందు నీకు కూడా ఆ అనుభవం వస్తుంది".

ఆ కథ కూడా వెంటనే అచ్చయింది. ఆ తర్వాత అతను తరచుగా కథలు రాసుకు వచ్చేవాడు. కానీ షరామామూలుగా ముగింపు లు నాకు సంతృప్తిని కలిగించేవికావు. అతనిలోని ఈ బలహీనత నన్ను బాధించేది. అయితే దానిని బయటపెట్టకుండా అతనికి ధైర్యం చెపుతూ ఉండేవాడిని. ముగింపును చెప్ప వలసిన బాధ్యత నేను తీసుకోక తప్పేది కాదు. క్రమంగా శ్రీధర్ మంచి రచయిత అయ్యాడు. తరచుగా అతని కథలు వివిధ వార, మాస పత్రికలలో పడుతుండేవి. కథల పోటీలలో బహుమతులు కూడా అందుకున్నాడు. అతని ఎదుగుదల నాకు గర్వంగా అనిపించేది. అతను ఎవరితో చెప్పినా మా గురువుగారి చలవ వలనే రచయితను అయ్యాను అనేవాడు. ఇదేమాట నా దగ్గర ఎవరైనా అంటే ఖండించే వాడిని.

"కథ పత్రికలకు పంపకముందు విని నా అభిప్రాయం చెప్పడం తప్ప నా సహకారం ఏమీలేదు. అతను నామీద గౌరవం కొద్దీ అలా అంటుంటాడు".

ఈ విధంగా నాదేమీలేదు అని మాట్లాడ టం నాకు సంతృప్తిని ఇచ్చేది. కానీ నా భార్యకి నా వరస నచ్చలేదు. శ్రీధర్ రచయితగా ఎదుగుతుంటే అందుకు కారణమైన నేను ఏ గుర్తింపు లేకుండా ఉండిపోయానని ఆమె అభిప్రాయం.

"శ్రీధర్ మంచి రచయిత అయితే అతనికి కూడా తట్టని ముగింపులు సూచిస్తున్న మీరెంత గొప్పవారు. అసలు ముగింపు చదివాకే కదా కథ బాగుందీ లేనిదీ చెబుతాం. మీరెందుకు కథలు రాయకూడదు. మీరిలా అజ్ఞాతంలో ఉండిపోవడం నాకేమీ నచ్చలేదు" అని వాపోయింది. ఆమె బాధ సహజమే. "నేనిపుడు కథలు రాయడం ఏమిటి ? పెద్ద పెద్ద రచయి తల కథలు విమర్శనాత్మకంగా చర్చించగల స్థాయిలో ఉన్నాను. ఇప్పుడు కథ రాయడం అంటే ఒక మెట్టు దిగడం లాంటిదే".

నిజానికి కథ రాయడం అంత సులభ మేమీ కాదు. అందులోనూ నాకు మంచి విమర్శకుడిగా ఉన్న గుర్తింపుకి ఆషామాషీ కథ రాయలేను. ఒక మంచి సబ్జెక్టును తీసుకోవడం, మంచి పట్టుతో చివరిదాకా చదివించేలా కథ రాయగలగడం సామాన్య విషయాలని నేను అనుకోను. శ్రీధర్‌కి అన్ని అయిడియాలు ఎలా వస్తాయో కానీ నా అశక్తతను వ్యక్తంచేసి భార్యముందు తేలిక కాదలచుకోలేదు. లోకానికి తెలియకపోవచ్చు కానీ శ్రీధర్‌కి వచ్చిన గుర్తింపులో నాకు కూడా వాటా ఉంది. ఈ సంతృప్తి చాలు.

కొంతకాలం ఇలా జరిగింది. హఠాత్తుగా శ్రీధర్ రావడం మానేసాడు. కొత్తకథ రాసినా లేకపోయినా వారానికి ఒకసారయినా

కథ, కవిత ఇలా ఏ సృజన చేసినా మాతృత్వం పొందడంతో సమానమని ఒకసారి మీరే అన్నారు. మరి ప్రాణంలేని బిడ్డలకు జన్మను ఇచ్చిన ఈ మాతృత్వానికి అర్థం ఏముంది ? మీరు ప్రాణం పోసిన బిడ్డలను నావిగా చెప్పుకుని తిరగడం ఏం న్యాయం ? ఇలాంటి మాతృత్వం కన్నా గొడ్రాలి జీవితం ఆనంద కరం కాదా ? 'మీ కథ చదివాం' ముగింపు అద్భుతంగా ఉంది. అని ఎవరైనా అన్నపుడు నేనెంతగా బాధపడ్డానో అనుభవిస్తేనే కానీ అర్థం కాదు. మిమ్మల్ని తప్పు పడుతున్నానని అనుకోకండి. తప్పంతా నాదే.



కలిసేవాడు నెలరోజులు గడిచినా రాలేదు. ఫోన్‌చేసినా దొరికేవాడు కాదు. అతను కొంతకాలంగా తన కథలు వినిపించడం అలవాటు చేసాడు. ఇప్పుడు అతను రాకపోతే ఏదో వెలితిగా అనిపించింది. నేను ఎన్నో సార్లు ఫోన్ చేసినా అతను ఒక్కసారైనా ఫోన్ చెయ్యకపోవడం బాధ కలిగించింది. అతను నా అవసరం ఇంక లేదనుకున్నాడా అని కూడా అనిపించింది కానీ శ్రీధర్ అటువంటివాడు కాదు అని మనసుకి సర్ది చెప్పుకున్నాను. ఎంత కాలం ఎదురుచూసినా శ్రీధర్ రాలేదు. కనీసం ఫోన్ అయినా చెయ్యలేదు. ఇంక నాకు మనసు ఉంబబట్టక అతనింటికి వెళ్ళాను.

నేను వెళ్ళేసరికి శ్రీధర్ తీరికగా కూర్చుని టి.వి. చూస్తున్నాడు. నన్ను చూడగానే 'రండి రండి' అంటాడనుకున్నాను. కానీ ముక్తసరిగా మాట్లాడి తన గదిలోకి తీసుకువెళ్ళాడు.

అతను ఏవో కుశల ప్రశ్నలు వేసాడు కానీ మాటతీరులో మునుపటి అభిమానం లేదు. ఏమయింది ఇతనికి. "నీ గురించి చాలా సార్లు ఫోన్ చేసాను. నువ్వు అసలు దొరకడం లేదు" అన్నాను.

అతను మాట్లాడలేదు.

"మామూలుగా వారానికి ఒకసారైనా వచ్చేవాడివి. ఈ సారి నెలలు గడిచినా రావాలనిపించలేదా? ఏదైనా ఇబ్బంది వచ్చిందా? దానికీ అతను మాట్లాడకపోయే సరికి కోపం వచ్చింది. "నేను రావడం నీకు ఇష్టం లేదా చెప్పు. వెళ్ళిపోతాను" అన్నాను.

ఇతనికి ఎంత సహాయం చేసాను. నా పనులు మానుకుని మరీ ఇతని కోసం సమయం కేటాయించిన సందర్భాలు ఉన్నాయి. నేను ఇచ్చిన సలహాలే ఇతని ఎదుగుదలకి కారణం. అంత చేసిన నేను స్వయంగా వచ్చినా సరిగా మాట్లాడటం లేదంటే గొప్పవాడినయి పోయా నని అహంభావమా ? నిజం చెప్పాలంటే ఇపుడు అతనికి ఉన్న గుర్తింపు ముందు నేను ఎంతటివాడిని.

'క్షమించండి. మిమ్మల్ని బాధ పెట్టాలని కానీ చిన్నబుచ్చాలని కానీ ఉద్దేశ్యం నాకు లేదు. నేను రాకపోవడానికి ఒక కారణం ఉంది. అది మీకెలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాను" అని కొద్దిసేపు ఆగాడు.

"నేను కథలు రాయకముందు అంతా బాగానే ఉండేది. మీతో చర్చిస్తూ ఎన్నో విషయాలు తెలుసుకుంటూ ఉండేవాడిని. కథలు రాయడం, మీ సలహాలు తీసుకోవడం తోనే ఇబ్బంది మొదలైంది. నాకిపుడు మంచి రచయితగా పేరు వచ్చింది. కానీ ఆ గొప్ప తనం నాది కాదు అనిపిస్తోంది. కథకి ప్రాణం ముగింపు అంటారు. ఆ ముగింపు నాది కానపుడు ఆగొప్పతనం నాకెలా చెందుతుంది? కథ, కవిత ఇలా ఏ సృజన చేసినా మాతృత్వం పొందడంతో సమానమని ఒకసారి మీరే అన్నారు. మరి ప్రాణంలేని బిడ్డలకు జన్మను ఇచ్చిన ఈ మాతృత్వానికి అర్థం ఏముంది ? మీరు ప్రాణం పోసిన బిడ్డలను నావిగా చెప్పుకుని తిరగడం ఏం న్యాయం ? ఇలాంటి మాతృత్వం కన్నా గొడ్రాలి జీవితం ఆనంద కరం కాదా ? 'మీ కథ చదివాం' ముగింపు అద్భుతంగా ఉంది. అని ఎవరైనా అన్నపుడు నేనెంతగా బాధపడ్డానో అనుభవిస్తేనే కానీ అర్థం కాదు. మిమ్మల్ని తప్పు పడుతున్నానని అనుకోకండి. తప్పంతా నాదే. మీరు మొదటి కథకి ముగింపు చెప్పినపుడే సున్నితంగా తిరస్కరించవలసినది. నేనిచ్చిన ముగింపుల వలన కథలు పేలవంగా ఉంటే ఉండవచ్చు. నేను రచయితగా ఎదగకపోయి ఉండవచ్చు. కానీ ఈ పరాధీనపు రచనల వలన రాను రాను ముగింపు గురించి ఆలోచించే సాహసం చెయ్యలేని స్థితికి వచ్చేసాను. కథకి న్యాయం చెయ్యాలంటే ఎలా ముగించాలి అని కాకుండా ఏ ముగింపుతో అయితే మిమ్మల్ని తృప్తి పరచగలనా అనే ఆలోచనతో సహజత్వాన్ని కోల్పోయాను. ఇంక ఈ ఆత్మద్రోహాన్ని చేసుకోదలచుకోలేదు. అందుకే కథలు రాయకూడదని నిర్ణయించుకున్నాను. ఇపుడు నాకు చాలా ప్రశాంతంగా ఉంది. కథలు రాయడం వలన దొరకని తృప్తి మానేయడం వలన దొరికింది. దయచేసి ఇంకెపుడూ కథల విషయమై నన్ను కలవకండి" అని లేచి నిలబడి చేతులు జోడించాడు.

అతనివాక్ప్రవాహానికి నిర్ఘాంతపోయాను. ఏం మాట్లాడాలో తోచలేదు. అప్రయత్నంగా లేచాను. అతను నేను ఎప్పుడు కదులుతానా అన్నట్టు చూస్తున్నాడు. "క్షమించు" అని మాత్రం అని బయటకు నడిచాను. అంతకుమించి ఒక్కమాట మాట్లాడినా నన్ను సమర్థించుకోవడం మొదలు పెడతాను. అది నాకిష్టం లేదు.

రోడ్డుమీద నడుస్తున్నానే కానీ నా చెవుల్లో అతని మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి. ఒక సృజనకారుణ్ణి నా చేతులతో చంపేశానన్న మాట. ఎంత దారుణం! అతనికోసం నేనెంతో చేసానను కున్నాను. నిజానికి అదంతా నిస్వార్థంగా చేసానా ? అతని ఎదుగుదలలో నా ప్రతిభను చూసుకుని మురిసిపోయిన మాట నిజం కాదా ? అతని కథలకి ముగింపును చెప్పడం ద్వారా నాఇగోని సంతృప్తి పరుచు కోవడం నిజం కాదా? అతను కథలు రాయక పోవడం ద్వారా, కొంత నాతో చెప్పుకోవడం ద్వారా కొంత బాధను దూరం చేసుకున్నాడు. మరి నేను నా బాధను ఎవరితో పంచుకోను. అతని కథల వెనకనున్నది నా గొప్పతనమే అని నమ్ముతున్న నా భార్యకి చెప్పుకోనా. లేక అసలు తెరవెనక నున్న నా పాత్ర తెలియని లోకానికి పిలిచి వివరించనా. ఎలా తగ్గుతుంది. నా బాధ. భారంగా నడక సాగించాను.